జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 24-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 81 పేజీలు: 8 వెల : రూ.7

# కదలడు.. వదలడు



* 25 ఏళ్లుగా పలాసను వదలని వైనం
* విద్యుత్ శాఖలో పాతుకుపోయిన ఉద్యోగి రాజారావు
* జూనియర్ లైన్‌మెన్‌గా కెరీర్ ప్రారంభం
* అంచెలంచెలుగా లైన్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి
* బదిలీ కాకుండా ప్రజాప్రతినిధులతో సిఫారసులు, అధికారులపై ఒత్తిళ్లు
* సంపాదన, ఆస్తులపై విజిలెన్స్ కన్ను

**శ్రీకాకుళం క్రైం, జులై 23 (వార్త):**

ఏ శాఖ ఉద్యోగికి అయినా బదిలీ ఖాయం. పారదర్శక సేవలతో పాటు ఒకే స్థానంలో పనిచేయడం వల్ల అవినీతి, ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి పెరుగుతుందని అధికారులు, ఉద్యోగులపై బదిలీ వేస్తుంటారు. ప్రతీ శాఖలో ఇది సాధారణమే. అయితే ఒక ఉద్యోగికి మాత్రం ఇది అతీతం. ఆయనే గార రాజారావు. పలాస విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌లోనూ, ప్రజాప్రతినిధులతో పరిచయాల్లోనూ ముందుంటాడు. పలాస, కాశీబుగ్గ మునిసిపాల్టీలో ఏకంగా 25 సంవత్సరాల పాటు పాతుకుపోయాడంటే ఆయన ఎలాంటి సమర్థత కలిగిన ఉద్యోగో ఇట్టే అర్థమైపోతుంది. 1998లో జూనియర్ లైన్‌మెన్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన.. పదోన్నతులతో అంచెలంచెలుగా ఎదుగుతూ లైన్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకున్నాడు. అయితే ఆయన ఉద్యోగమంతా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల చుట్టూ తిరగడం విశేషం. గత ఏడాది సీనియర్ లైన్ మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. జిల్లా వ్యాప్తంగా చాలా మందికి ఇదే మాదిరిగా పదోన్నతులు లభించాయి. ఆపై బదిలీలు జరిగాయి. కానీ రాజారావుకు పదోన్నతి లభించడమే కాదు. ఉన్నచోటే పోస్టింగ్ లభించడం విశేషం.

## వారందరికీ అతీతంగా..

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆముదాలవలస, పలాస,కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మునిసిపాల్టీలు ఉన్నాయి. వీటి పరిధిలో సేవలందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు చాలా మందికి 2023 జూన్‌లో పదోన్నతులతో కూడిన బదిలీలు జరిగాయి. కానీ ఎక్కడా లేని, ఎవరికీ లేని మినహాయింపు గార రాజారావుకు దక్కడం విశేషం. పలాసకు చెందిన అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు మంత్రి కావడంతో ఆయన ద్వారా పావులు కదిపారు. ఏకంగా పలాస, కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ నుంచే ప్రత్యేక మినహాయింపు తెప్పించుకున్నారు. గత ఏడాది జూన్ 29న పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలను విద్యుత్ శాఖ పరంగా వేరుచేస్తూ సిఫారసు లేఖ తెచ్చుకున్నారు. ఆ లేఖ ప్రాప్తికి కాశీబుగ్గ విభాగానికి లైన్ ఇన్ స్పెక్టర్‌గా నియమించారు. అయితే జిల్లాలో మిగతా ప్రాంతాల్లో పదోన్నతిపై బదిలీ చేసిన వారికి మాత్రం 20 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో నియామకాలు చేశారు. జిల్లాలో ఒక్క గార రాజారావుకు మాత్రమే ఈ మినహాయింపు లభించింది అంటే ఆయన ఏ స్థాయిలో లాబీయింగ్ చేస్తాడో ఇట్టే అర్థమవుతోంది.

## యూనియన్ లోనూ యాక్టివ్..

విద్యుత్ యూనియన్‌లో గార రాజారావుది క్రియాశీలక పాత్ర. 1104 విద్యుత్ యూనియన్‌ను తన కనుసన్నల్లో శాసించే స్థాయికి చేరుకున్నాడు. సాధారణంగా విద్యుత్ శాఖలో యూనియన్లు క్రియాశీలక పాత్ర పోషిస్తుంటాయి. అత్యవసర విభాగపు శాఖ కావడంతో ప్రభుత్వం కూడా యూనియన్లకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంటాయి. దీనినే ఆసరాగా చేసుకొని రాజారావు చేసే అతి అంతా ఇంతా కాదు. తనకు నచ్చినట్టు పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు యూనియన్ నేతలపై ఒత్తిడి చేస్తుంటాడు. గత 25 సంవత్సరాల్లో ఒక్కసారంటే ఒక్కసారి కూడా ఆయనకు బదిలీ జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వారిని.. ఎవరు ఎమ్మెల్యే అయితే వారి ప్రాపకం ఇట్టే పొందడంలో నేర్పరి కూడా.

## సినిమాల్లోనూ నటించాడు సుమీ..

దీనికితోడు ఈయనకు సినిమాల్లో నటించాలన్న కోరిక అధికం. అందులో తప్పులేదు కానీ... ఒక విద్యుత్ శాఖ ఉద్యోగిగా ఉంటూ.. 'పలాస' సినిమాలో పోలీసాఫీసర్ పాత్రలో నటించి బాగానే మెప్పించాడు. శాఖాపరమైన అనుమతులు లేకుండా నటించాడన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ శాఖలో ఆయనది పెద్ద సామ్రాజ్యమే అన్న ప్రచారం కూడా ఉంది. కానీ ఏ ప్రభుత్వం వచ్చినా.. ఎన్నిరకాల పదోన్నతులు వచ్చినా.. బదిలీలు జరిగినా.. రాజారావు స్థానం పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల నుంచి కదలకపోవడం తోటి విద్యుత్ శాఖ సిబ్బందిని విస్మయపరుస్తోంది.

## ఆస్తులు కూడా బాగానే...

లైన్‌మేన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఒకేచోట సుమారు 25 ఏళ్లపాటు పాతుకుపోయిన ఈ వ్యక్తి ఆస్తులు కూడా బాగానే కూడబెట్టుకున్నాడని తోటి ఉద్యోగులే చెబుతుంటారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో విద్యుత్ సమస్య వస్తే ఈయనకు ప్రజాప్రతినిధులు ఫోన్ చేయాల్సిందే.అయితే ఆయన మాత్రం డ్యూటీకి వెళ్లడు. అనుచరులతో చేయిస్తూ ఇతగాడు పబ్బం గడుపుకుంటున్నాడన్న విమర్శలు ఉన్నాయి. ఇతగాడిపై విజిలెన్స్ అధికారులు కన్ను కూడా పడిందని, అయితే యూనియన్ నేత కావడం, ప్రజాప్రతినిధులతో పరిచయాలు ఉండడంతో ఏదోలా మేనేజ్ చేస్తుంటాడని ఆ శాఖ అధికారులే అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఒక్కచోటే సుమారు 25 ఏళ్ల పాటు పనిచేయడం అంటే అంత వీజీ కాదు..

(లైన్ ఇన్‌స్పెక్టర్ దందాలు, అక్రమాలు, తెర వెనుక బాగోతాలపై త్వరలో మరో కథనం)



## అసాంఘిక కార్యకలాపాలపై...

# నిఘా పెంచండి

* బాధ్యతగా విధులు నిర్వహించండి * ప్రతిరోజూ విస్తృతంగా తనిఖీలు చేయాలి
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి * పోలీస్ అధికారులకు దిశ నిర్దేశం

**శ్రీకాకుళం క్రైం, జులై 23 (వార్త):** ప్రతి రోజు పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి గంజాయి, నాటు సారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టి, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి సారి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని జిల్లాలో పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనాభా,భూ నైసర్గిక స్వరూపం, సరిహద్దు ప్రాంతాలు, జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం, శాంతి భద్రతల సమస్యలు, నేరాలు నమోదు, నేర ప్రవృత్తి, సమస్యాత్మక గ్రామాలు, ట్రబుల్ మ్యాంగర్స్, స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు నిష్పక్షపాతమైన పోలీసు సేవలను అందించాలన్నారు. ఫిర్యాదు దారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే సదరు ప్రదేశానికి చేరుకొని వాస్తవాలు పరిశీలించి, సమగ్రమైన విచారణ జరిపి ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఎన్నికల కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. ఇచ్చిన ఆదేశాలను అనుసరించి ప్రతి రోజు నిర్వహిస్తున్న ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌లో వాహనాలు తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. తరచు నేరాలు జరుగుతున్న ప్రదేశాలు, ప్రాంతాలు గుర్తించి గస్తీలు విస్తృతంగా తిరగలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్లో ఉన్న ముఖ్యమైన కేసులు వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు జి ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు బాలచంద్ర రెడ్డి, శృతి, త్రినాథ్‌రావు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రావు, ఏఓ గోపినాథ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## అప్రమత్తతతోనే.. విద్యుత్

# ప్రమాదాల నివారణ

* సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు 1912 * ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి



**శ్రీకాకుళం, జులై23 (వార్త):** విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ.. ప్రమాదాలను నివారిద్దా మని విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సూపరెం టెండింగ్ ఇంజనీర్ ఎన్.కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. తుఫాన్ సమయంలో మీ ఇంటి గృహెూ పకరణాల స్విచ్ లను ఆఫ్ మోడ్లో ఉంచాలని, ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్ లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా.. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంబాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 కు తెలియజేయాలన్నారు.



## గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు

**కొత్తూరు, జులై 23 (వార్త):** కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్ -2 గ్రామపంచాయతీ లో గల యూత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అర్జీ మేరకు గ్రంధాలయం నిర్మించుటకు గాను కొత్తూరు తహసీల్దార్ వంశధార నిర్వాసితుల కాలనీలో సర్వే నెం. 334-2 రిజర్వు స్థలంలో 0.08 సెంట్లు కేటాయించారు. ఈ స్థలానికి సంబంధించిన ధ్రువపత్రాలను మెట్టూరు బిట్ -2 పంచాయతీ కార్యదర్శి యూత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమక్షములో కొత్తూరు మండల పరిపాలనాధికారి బసవ రాంబాబు అప్పగించారు.

# రోడ్డుపై నీటిని తొలగించారు

* వార్త కథనానికి స్పందన * శ్రమదానం చేసి మురుగునీరు లేకుండా చేసిన ఎంజీఆర్ యువసేన సభ్యులు
* అభినందించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు * సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతాం: ఎంజీఆర్ యువసేన




పాఠశాల ఆవరణలో వర్షపు నీరు
* మోకాళ్ల లోతు వరకూ నిలిచిన నీరు * పాఠశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
* నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్న తల్లిదండ్రులు

**మెళియాపుట్టి, జులై23 (వార్త):** ముక్తాపురం గ్రామంలో పాఠశాల ఆవరణలో మురుగునీరు నిలిచి పోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారని 'పాఠశాల ఆవరణలో వర్షపు నీరు' 'వార్త'లో వచ్చిన కథనానికి ఎంజీఆర్ యువసేన సభ్యులు స్పందించారు. మంగళవారం పాఠశాల ఆవరణకు చేరుకుని శ్రమదానం చేసి రోడ్డుపై నీరు లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే రహదారిని శుభ్రం చేశారు. శ్రమదానం చేసిన ఎంజీఆర్ యువసేనకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ యువసేన సభ్యుడు ధర్మాన రమేష్ మాట్లాడుతూ గత కొన్నేళ్లగా ఈ సమస్య ఉందన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో తామే స్వచ్ఛందంగా శ్రమదానం చేసి తాత్కాలికంగా ఈ సమస్యను పరిష్కరించుకున్నామన్నారు. ఈ రోడ్డు విషయమై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

# విజేతలకు పౌర సన్మానం



**సంతబొమ్మాళి, జులై 23 (వార్త):** ప్రతిభకు పేదరికం అడ్డు కావని మండల విద్యాశాఖాధికారులు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునరావు అన్నారు. గత పదవ తరగతి ఫలితాలలో మండల ప్రథమ స్థానం సాధించిన బోరుబద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జవ్వాది జాహ్నవి, అత్యుత్తమ మార్కులతో పాటు ఐఐఐటి సీట్లు సాధించిన చెక్క సంధ్య, పందిరి ఓంకార్, పాలిన హారికలను మూలపేటకి చెందిన ఉపాధ్యాయుడు ఎం.ప్రఫుల్ కుమార్, మన బడి అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయుడు ప్రఫుల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా మండల ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి సన్మానం చేయడం ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపడం తన ఆశయమన్నారు. గ్రామ పెద్దలు బి.లక్ష్మయ్య, చింతాడ చిన్నారావు, అప్పిని వెంకటేష్, చింతాడ దిలీప్, ఆరంగి రామారావు, ఎమ్. రమణమూర్తి, శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల విద్యా పరంగా, మౌలిక వసతుల పరంగా అభివృద్ధి పథంలో ఉండడం ఆనందకరమన్నారు. పాఠశాలకు కావాల్సిన ఆడిటోరియం, అదనపు భవనాలు, త్రాగు నీరు సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మన బడి అసోసియేషన్ నాయకులు సూరిబాబు, శివారెడ్డి, జగదీష్ మాట్లాడుతూ విజేతలకు మా సంస్థ తరపున సన్మానం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ సంఘ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.లక్ష్మయ్య, చింతాడ చిన్నారావు, ఆరంగి రామారావు, అప్పిని వెంకటేష్, ఎమ్.రమణ మూర్తి, చింతాడ దిలీప్, శ్రీనివాస్, ఎమ్.ఆనందరావు, ఎమ్. నర్సింహామూర్తి, జి.వాసుదేవరావు, పట్నాన శ్రీకాంత్, పొట్నూరు కిరణ్ కుమార్, జి.గోవిందరావు, గోపి వివిధ సంఘాల నాయకులు రామారావు, రెడ్డి సూరిబాబు, పాపారావు,లక్ష్మణ రావు, శంకర్,ఉపాధ్యాయులు టి.లోకేశ్వర రావు, ఉమా శంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, ఉమాదేవి, రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి, తవిటిరెడ్డి, జగదాంబ, రజిని, శ్రీనివాసరావు, తిరుపతి రావు, శంకర రావు, కమల కుమారి, గోపాల రెడ్డి, సుశీలా దేవి, కృష్ణ, సాయి శివాని, త్రివేణి పాల్గొన్నారు

## పాతపట్నం అభివృద్ధికి సహకరించండి

**కొత్తూరు, జులై 23 (వార్త):** రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన పాతపట్నం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళవారం సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. మహేంద్ర తనయ, వంశధార నదులపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టల మంజూరుకు సహకారం అందించడం తోపాటు రహదారుల నిర్మాణానికి, మరమ్మతులకు నిధులు వెచ్చించాలని కోరారు.



# ప్రకటన పోస్టర్లు తొలగింపు

**శ్రీకాకుళం టౌన్, జులై 23(వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థకు సంబంధించిన గోడలపైన ప్రకటన పోస్టర్లు లను నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కార్మికులు మంగళవారం తొలగించారు. రైతు బజార్, డే అండ్ నైట్ కూడలి, ఇలిసిపురం పలు పరిసర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది తొలగించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ అనుమతులు లేని ప్రకటన బోర్డులు, పోస్టర్లు తీసేయాలని కోరారు. ఎక్కడ సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదన్నారు. నగరమంతా పరిశుభ్రంగా కనిపించాలని, పెద్ద పెద్ద ప్లెక్సీలు, పోస్టర్లు, ప్రకటన బోర్డులు ఉండకూడదని ఆదేశాలు జారీ చేశారు. మురికి కాలువల్లో చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించి, స్వచ్ఛ శ్రీకాకుళంగా కనిపించాలని కమిషనర్ ఓబులేషు ఆదేశించారు.









## ఎమ్మెల్యే గౌతు శిరీషాతోనే
# గిరిజనులకు న్యాయం

**మందస, జులై 23 (వార్త):** పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీషాతోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు అన్నారు. మందస పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గిరిజన నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దృఢ నిశ్చయంతో గిరిజనులందరూ టిడిపిని గెలిపించడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి ఎజెండాగా పలాస నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే గౌతు శిరీష ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల కాలంలోనే గిరిజన సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా మందస మండలం డబార్సింగి గ్రామంలో సుమారు రూ.3 కోట్ల నిధులతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాశ్యం, విద్యాలయం (ఎన్.ఎస్.సి.బి.ఏ.వి) మంజూరైనట్లు తెలిపారు. పాఠశాలలో 50 మందివిద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా ఏర్పాటు కానున్నదన్నారు. గిరిజనవిద్యార్థులకు ఈపాఠశాల ఎంతో మేలు చేకూర్చనున్నదని తెలిపారు. సంబంధిత పాఠశాల మంజూరుకు కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, శంకరరావు, సవర లక్యా, రాజు, ధర్మారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 25న వాహనాల వేలం

**పాలకొండ, జులై 23 (వార్త):** పాలకొండ పోలీస్ స్టేషన్ ఎక్సయిజ్ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలను ఈ నెల25న వేలం వేయనున్నామని పాలకొండ ఎస్ఐ ప్రశాంత్ కుమార్ మంగళవారం తెలిపారు. సీజ్ చేసిన తరువాత సదరు వాహన యజమానులకు నోటీసులు పంపించినా సంబంధిత యజమానులు తీసుకువెళ్లలేదన్నారు. దీంతో వీటిని బహిరంగ వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు వాహనాలను వేలంలో పాడవచ్చని తెలిపారు.

## మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం

**ఆమదాలవలస, జులై 23 (వార్త):** ఆమదాలవలసకు చెందిన ఒక వ్యక్తిపై మద్యం మత్తులో రైల్వే కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం విశాఖ ఎక్స్ప్రెస్ రైలులో ఆమదాలవలస నుండి విశాఖపట్నం అత్తవారి ఇంటికి వెళుతున్న వ్యక్తిపై ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పాపారావు మద్యం మత్తులో చేయిచేసుకున్నాడు. తోటి ప్రయాణికులు కానిస్టేబుల్‌ను వారించినా ఆ వ్యక్తిపై దుర్భాషలాడాడు. అలాగే అతని వద్ద నుంచి రూ.6వేలు నగదును లాక్కున్నాడు. దీంతో బాధితుడు 100కి సమాచారం అందించాడు.

## బిచ్చగాడు మృతి



**శ్రీకాకుళం క్రైం, జులై 23 (వార్త):** నగరంలోని జీటీ రోడ్డులో విజేత హోటల్ సమీపంలో మంగళవారం ఓ బిచ్చగాడు అపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు 100 కాల్ చేసి సమాచారం అందించారు. వన్ టౌన్ ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బిచ్చగాడిని హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బిచ్చగాడు మృతి చెందాడు. అతని పర్సును ఎస్ఐ కృష్ణారావు తెరిచి చూశారు. ఆధార్ కార్డులో అన్నెపు అమ్మన్నగా పేరు ఉంది. విశాఖ జిల్లా పెద్దగంట్యాడ అనే అడ్రస్ ఉంది. అమ్మన్న కుటుంబ సభ్యులకు ఎస్ఐ సమాచారం అందించారు.

## ఆధార్ కేంద్రాల్లో సేవలు సద్వినియోగం చేసుకోండి

**ఇచ్ఛాపురం, జులై 23 (వార్త):** ప్రస్తుత ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లు అన్ని సచివాలయంలలో నిర్వహిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం మండపల్లి, అరకబద్ర, బాల కృష్ణాపురంలలో సేవలు ప్రారంభించారు. బెల్లు పడ, కార్జీ వీధి సచివాలయంలో 35మందికి ఆధార్ సేవలు అందించినట్లు కమిషనర్ రమేశ్ చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మధ్యవర్తిత్వం ద్వారా కేసుల రాజీ

**శ్రీకాకుళం లీగల్, జులై 23 (వార్త):** మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. మంగళవారం రణస్థలంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు న్యాయపరమైన అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల తప్పులు చేయడానికి ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీవో కేవీ రమణ పాల్గొన్నారు.

# మహిళలకు అండగా రక్షణ చట్టం

## ఐసీడీఎస్ పీవో విమలారాణి

**మెళియాపుట్టి, జులై23 (వార్త):** మహిళలకు అండగా రక్షణ చట్టం2013 నిలుస్తుందని ఐసీడీఎస్ పీవో విమలారాణి అన్నారు. మెళియాపుట్టిలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో జి.భాస్కరరావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు ఈ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి మహిళా ఉద్యోగికి గౌరవమివ్వాలని, వారిపై ఎటువంటి వేధింపులకు పాల్పడినా ఈ చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోమండల విద్యాశాఖాధికారులు దేవేంద్రరావు, పద్మనాభం, ఏపీఎం లలిత, మండల పరిషత్ ఏవో తిరుపతి పట్నాయక్, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## లైంగికంగా వేధిస్తే ఫిర్యాదు చేయండి

**పలాస, జులై 23 (వార్త):** పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో పీవో లావణ్య హెచ్చరించారు. పలాస మున్సిపాలిటీ కార్యాలయంలో లైంగిక వేధింపులు నిరోధక చట్టం 2013పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులు నియంత్రణకు ప్రతిచోటా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా సీనియర్ మహిళా ఉద్యోగిని ఉండాలన్నారు. మరో మహిళా ఉద్యోగి, పురుష ఉద్యోగిని సభ్యులుగా ఉండాలన్నారు. సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సంస్థను కమిటీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించాలన్నారు.

## బడ్జెట్ నిరాశాజనకం



**బూర్జ, జులై 23 (వార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్ బడా బాబులకు దోచిపెట్టేదిలా, పేదవాడిని దోచుకునేలా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావు అన్నారు. బడ్జెట్ నిరాశపరచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏదో ఇచ్చేసాం అమరావతికి నిధులు ఇచ్చేశాం అంటూ కూటమి నేతలు ప్రగల్బాలు పలుకుతున్నారు, వాళ్లు ఇచ్చినవి నిధులు కాదు అప్పులని తెలిపారు. అప్పు అనేది ఏనాటికైనా మనం తిరిగి చెల్లించాల్సిందేనని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌తోనే రాష్ట్రం అభివృద్ధి



**ఎల్ఎన్‌పేట, జులై23 (వార్త):** కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ తో ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 15వేల కోట్లు కేటాయించడంపై శ్రీకాకుళం జిల్లా బిజెపి అధికార ప్రతినిధి వాన సోమేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయింపు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం, విద్యా నైపుణ్యాభివృద్ధికి రూ.1.48లక్షల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకి రూ.1.52 కోట్లు కేటాయింపుతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపు వల్ల రాష్ట్రంలో ఉన్న మధ్య తరగతి ప్రజలు, మహిళలు, యువత, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఊతం



**ఇచ్ఛాపురం, జులై 23 (వార్త):** కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ తో ఆర్థిక ఇబ్బందులులో ఉన్న రాష్ట్రానికి ఊతం ఇచ్చినట్లు అయ్యిందని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలా రెడ్డి అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయింపు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం, విద్యా నైపుణ్యాభివృద్ధికి రూ.1.48లక్షల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకి రూ.1.52 కోట్లు కేటాయించామని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌పై హర్షం



**పలాస, జులై23 (వార్త):**కేంద్ర బడ్జెట్‌పై పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీ బీజేపీ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్‌రాజు హర్షం వ్యక్తం చేశారు. ఏపీకి కేటాయింపులు గణనీయంగా ఉన్నాయన్నారు. అమరావతికి రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయంతో ఏపీ పునర్విభజన చట్టానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తేటతెల్లమైందన్నారు. పోలవరానికి త్వరితగతిన పూర్తికి, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, విశాఖ- చెన్నై కారిడార్‌లో కొప్పర్తి, హైదరాబాద్ -బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడంపై ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అభ్యాసన పద్ధతులు అలవాటు చేయాలి

**సారవకోట, జులై 23 (వార్త):** ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు అభ్యాసన అలవాటయ్యేలా కృషి చేయాలని ఎంఈవో మద్దు వెంకటరమణ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన సారవకోట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసీ కార్యక్రమాలను శిక్ష సప్తహ్‌లో భాగంగా నిర్వహించామన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**జలుమూరు, జులై 23 (వార్త):** మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దింటి కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన జలుమూరులోని మహిళా సమాఖ్యను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘ సభ్యులతో సమావేశమై, మాట్లాడారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జలుమూరులో మహిళా మార్ట్ నిర్వహణకు మహిళా సంఘ సభ్యులు ముందుకు రావాలని కోరారు. ఈ మార్ట్ ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని వారికి సూచించారు.





## మూలిపాడులో ఆవేటి మంగళవారం పూజలు

**మందస, జులై 23 (వార్త):** మందస మండలంలోని మూలిపాడులో భక్తి, శ్రద్ధలతో ఆవేటి మంగళవారం పూజలు జరిగాయి. సర్పంచ్, వైసీపీ యువనాయకుడు గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో వైభవంగా కొండ మహంకాళి అమ్మవారు, గ్రామ దేవతకు ప్రత్యేకపూజలు చేశారు. వెంకటరావు ఇంటి వద్ద నుంచి మేళ, తాళాలతో అమ్మవార్లను మహిళలు పూర్ణకుంభాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానికులు నాట్యాలతో అమ్మవార్లకు చల్లదనం చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పిట్ట భీమారావు, పుప్పాల రాఘవరావు, దట్టి కోదండరావు, గుసిరి నాగేశ్వరరావు, గంగాధరరావు, బొందల వెంకటరావు, తెలుకల చక్రపాణి, తెలుకుల మురళి, దుదిష్టి, తెలుకల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పలాస కాశీబుగ్గ ప్రోగ్రెసివ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**పలాస, జులై 23 (వార్త):** పలాస కాశీబుగ్గ ప్రోగ్రెసివ్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షునిగా దేవ విశ్వేశ్వరరావు(నాని), కార్యదర్శిగా నల్ల నారాయణరావు, గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ వంకల రాజారావును ఎన్నుకున్నారు. పలాసలోని మున్సిపాలిటీ కీర్తన ఫంక్షన్ హాల్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ సమాన న్యాయం.. సమాన ఫలితం తమ సంఘ ప్రధాన అజెండా అన్నారు. జర్నలిస్టులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్‌బ ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెడికల్ రాయితీలు, అర్హులందరికీ ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.





## బాధితునికి చేయూత

**సోంపేట, జులై 23 (వార్త):** బారువ సోంపేట రోడ్డులో కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతున్న తెలుకుల వంశీ కుటుంబానికి వైద్యఖర్చులు నిమిత్తం బారువ పెద్ద అమ్మవారు కమిటీ సేకరించిన రూ.26,200లను తల్లిదండ్రుల తెలుకుల కిశోర్, లక్ష్మీలకు మంగళవారం అందజేశారు.

## రాజకీయ హామీలకు కేంద్ర బడ్జెట్ పరిమితం

*** బడ్జెట్ అంతా అంకెల గారడీ * సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్**

**శ్రీకాకుళం టౌన్, జులై 23 (వార్త):** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బి గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాటలు ఘనం.. నిధులు నిల్ అన్నట్లుగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌కి ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారు. కానీ నిధులు కేటాయింపు నిరాశ కలిగించిందని, చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించిందన్నారు. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదన్నారు. 15 వేల కోట్ల రూపాయలు నేరుగా గ్రాంటుగా ప్రకటిస్తే బాగుండునన్నారు. వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ప్రత్యేక హెూదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదు. గత పది సంవత్సరాల నుండి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బిజెపి నిర్లక్ష్యం చేసింది. ఈ బడ్జెట్‌లోనూ ఆశించిన రీతిలో కేటాయింపులు లేవన్నారు. పుణ్యక్షేత్రాల టూరిజం, వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా, ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా, బిజెపిపైనా రాజకీయ ఒత్తిడి తేవాలన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

**శ్రీకాకుళం టౌన్, జులై 23 (వార్త):** వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలపై దృష్టి సారించాలని సంబంధిత మంత్రి సవితను ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవితను గొండు శంకర్ మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసారని, వెనుకబడిన తరగతుల వసతి గృహాలు దయానీయ పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతులు చేపట్టాల్సి వుందన్నారు. అదేవిధంగా సిబ్బంది కొరత వెంటాడుతోందని మంత్రికి వివరించారు. విద్యుత్ సమస్యలను అధిగామించేందుకు సోలార్ సిస్టం అందుబాటులోకి తేవాలని, సొంత భవనాలు లేని హాస్టళ్లకు పక్క భవనాలు నిర్మించాలని కోరారు. వీటితో పాటు పాత మెనూ ఛార్జిలను పెంపుదల చేయాలని గొండు శంకర్ మంత్రి సవితను కోరారు. అయన అభ్యర్ధన పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

# స్టేడియం పనులు ప్రారంభించండి

- ✻ ప్రతీ రోజు పురోగతిపై చెప్పాలి
- ✻ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం
- ✻ శ్రీకాకుళం, ఆమదాలవలస రోడ్డుపై చర్చ



**శ్రీకాకుళం, జులై 23 (వార్త):** కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం పనులు తక్షణమే ప్రారంభించి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కోడి రామమూర్తి మైదానం నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షం కారణంగా పనులు ఇంకా ప్రారంభించలేదని కాంట్రాక్టర్ కలెక్టర్ కు వివరించారు. పనులకు సంబంధించి ఏ ఏ మెటీరియల్ ఎక్కడ నుండి వస్తున్నదీ తెలియజేయాలని ఎఈఈని ఆదేశించారు. లేబర్ ఎక్కడ నుండి వస్తున్నది ఆయన అడుగగా ఒరిస్సా నుండి వస్తున్నట్లు చెప్పగా పని వారికి సంబంధించిన వారి ప్రయాణ వివరాలు సేకరించాలని ఎఈఈని ఆదేశించారు. పెద్ద వర్షం పడితే తప్పా పనులు ఆపకూడదన్నారు. ఈ భవనంలో ఏ ఏ పనులు జరుగుతాయని ఆయన అడుగగా సీలింగ్ ప్లాస్టింగ్, బ్రిక్ వర్క్స్ ఉందని, భవనంపై మరో ఫ్లోర్ వేస్తామని ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్ ఆయనకు వివరించారు. ఇసుక, ఇటుక, సిమెంట్ ఎంత అవసరమో తెలియజేయాలన్నారు. ప్లాస్టింగ్, బ్రిక్ వర్క్ ఎన్ని రోజులు పడుతుందని వరకు ఆయన అడగగా నెల రోజులు పడుతుందని ఎఈఈ చెప్పారు. ప్రతీరోజు ఏఏ పని ఎంత జరుగుతుందో తెలియజేయాలని డీఈఈ గణపతి రావును ఆదేశించారు. ఇటుక ఎక్కడ నుండి వస్తుందని ఆయన అడుగగా చిలక పాలెం నుండి వస్తుందని తెలిపారు. పనులు త్వరితగతిన నాణ్యతతో ఉండాలని తెలిపారు. టాయిలెట్లు, ఎంట్రన్స్, తదితర ప్లాన్ అందజేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జూం కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతానికి అవసరమైన జిమ్ ఎక్విప్ మెంట్ ఏర్పాటు చేయాలని డిఎస్డీఓను ఆదేశించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణం పనులపై చర్చించారు. ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ ఎస్. రవి నాయక్, డిఎస్డీఓ శ్రీధర్, ఆర్అండ్బి డిఈ గణపతిరావు, ఎఈఈ పిటి రాజు పాల్గొన్నారు.

### జిల్లాలో అంతగా నష్టం లేదు

జిల్లాలో కంచిలి, కవిటి, మందస, ఎచ్చెర్ల, తదితరులు మండలాల్లో ఇతర మండలాల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం వెల్లడించారు. జిల్లాలో నాగావళి, వంశధార నదులు ఉన్న నేపధ్యంలో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే నీరు ఐదు వేలు క్యూసెక్కుల వరకు వచ్చినట్లు ఆయన వివరించారు. నదుల వలన ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. కాలువల వద్ద లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వరి పంటపొలాలు సుమారు 150 ఎకరాల వరకు ముంపుకు గురైందని సమాచారం వచ్చిందని, దీనికి సంబంధించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఒక 6 వరకు గృహాలు డేమేజ్ అయ్యాయని, కొన్ని రోడ్లు పాడైనాయని, ఎలక్ట్రికల్ 5 లక్షల రూపాయలు వరకు ఫోల్స్ కు ఖర్చు అవుతుందని చెప్పారు. జిల్లా యంత్రాంగం అంతా పగడ్బందీగా ఉండడం వలన, ఆయా కేంద్రాల్లో యంత్రాంగం ఉండి ప్రజలను అప్రమత్తం చేయడం వలన ఎలాంటి మానవ, పశువులను నష్టపోలేదని, సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులను నష్టపోలేదన్నారు. మత్స్యకారులకు సముద్రంలో చేపల వేటకు వెల్లరాదని సూచించినట్లు చెప్పారు. ప్రతీ మంగళవారం, శుక్రవారంలలో ఏంటీ లార్వా కార్యక్రమాలు చేయడం జరుగుతోందన్నారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, జిజిహెచ్, ఆసుపత్రుల్లో పూర్తిగా శుబ్రపరచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతీ శుక్రవారం ప్రతీ ఇంటినీ శుబ్రపరచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది, మలేరియా సిబ్బంది ఇంటింటికి వెళ్ళి మలేరియా, డెంగ్యూ వంటి వాటిపై తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రజల నుండి రెస్పాన్స్ వస్తుందన్నారు. ఇళ్లలో ఉండే ఫ్రిజ్ లకు వెనుక భాగంలో ఉండే బాక్స్, కూలర్ లు, ఇంటిపైన, ఇంటి బయట పనికిరాని వస్తువులలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, మలేరియా, డెంగ్యూలు మురుగు కాల్వలలో కాకుండా మంచి నీరు, వర్షపు నీళ్లలోనే జన్మిస్తాయని చెప్పారు. ప్రజలంతా మున్సిపల్, మలేరియా సిబ్బందికి సహకరించి డెంగ్యూ, మలేరియా రాకుండా నివారించేందుకు సహకరించాలని ఆయన కోరారు. భారీవర్షాలు తగ్గినప్పటికి వర్షాలు కొనసాగుతున్నందు వలనప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అందరూ నీరు వేడి త్రాగాలని ఆయన కోరారు.

# జేసీ పనితీరు అభినందనీయం

- ✻ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ✻ జేసీ నవీన్‌కు ఆత్మీయ వీడ్కోలు

**శ్రీకాకుళం, జులై 23(వార్త):** జాయింట్ కలెక్టర్‌గా మల్లారపు నవీన్ శ్రీకాకుళం జిల్లాపై చెరగని ముద్ర వేశారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ కు మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులు, రెవిన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అతి ముఖ్యమైన మూలపేట పోర్టు భూసేకరణ, రీసర్వే, ధాన్యం సేకరణలో ఆయన మంచి పనితీరు కనబరిచారని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యమైన ఎన్నికల నిర్వహణలో ఒక గొప్ప ప్రతిభావంతుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. మంచి ప్రణాళికతో, సరైన తీరులో మెరుగైన సామర్థ్యం కలిగిన అధికారిగా, వ్యక్తిగా ఉండి మంచి సూచనలు, సలహాలు ఇచ్చేవారని జాయింట్ కలెక్టర్ సేవలను కొనియాడారు. ఏపీ సిఆర్డిఏ కు ఆయన సేవలు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. బదిలీపై వెళ్తున్న జేసి ఎం నవీన్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆత్మీయ సత్కారం మరువలేనిదని అన్నారు. మూలపేట పోర్టు భూసేకరణ, తక్కువ వ్యవధిలోనే పోర్టు పనులు ప్రారంభించడం, రీ సర్వే, ఎన్నికల నిర్వహణ, ముఖ్యంగా ధాన్యం సేకరణ, రైతులకు సకాలంలో చెల్లింపులు తనకెంతగానో తృప్తినిచ్చాయని ఈ సందర్భంగా చెప్పారు. తాను ఎక్కడ పని చేసినా శ్రీకాకుళం జిల్లా ఎప్పుడూ ప్రత్యేకమేనని అన్నారు. కోవిడ్ సమయంలో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతిని మిగిల్చిందని, మంచి బృందంతో పనిచేసిన అదృష్టం తనకు కలిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ నవీన్ యువ నాయకత్వంలో కలిసి పనిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పలువురు జిల్లా అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడి శాంతి శ్రీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే. శ్రీధర్. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట రామన్, పలాస ఆర్డిఓ భరత్ నాయక్ తదితరులు మాట్లాడారు. సూడా ప్రత్యేక అధికారిగా, ఆమదాలవలస ఆర్వోగా వేరువేరు ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన పనితీరును గురించి ప్రస్తావించారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగం విజయవంతం కావడంలో జెసి నవీన్ ది ప్రత్యేక పాత్రని కొనియాడారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు మాట్లాడుతూ విధానపరమైన నిర్ణయాలను ధైర్యంగా తీసుకోవడంలో జేసీగా ఎప్పుడూ ముందుండేవారిని చెప్పారు. వేగంగా పని పూర్తి చేయడంలో విశిష్ట శైలికలిగిన వ్యక్తిగా కొనియాడారు. అనంతరం జేసిని అధికారులంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ అహ్మద్, ఆర్డిఓ సిహెచ్.రంగయ్య, సీపీఓ ప్రసన్నలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డి ఎం హెచ్ ఓ బి మీనాక్షి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, పశుసంవర్ధక శాఖ జెడి జయరాజ్, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## ‘విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయండి’

**నరసన్నపేట, జులై 23 (వార్త):** పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందు పరచాలని నరసన్నపేట ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. మంగళవారం ఆయన మండల విద్యాశాఖ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ‘తల్లికి వందనం’ పథకంలో భాగంగా ప్రతి విద్యార్థి ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్లు నమోదు చేయాలని సూచించారు.

## వీధి కుక్కల స్వైర విహారం



**పోలాకి, జులై 23 (వార్త):** పోలాకి మండలం పిన్నింటిపేటలో వీధి కుక్కల స్వైర విహారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీటి ధాటికి పిల్లలను స్కూలుకు పంపాలంటే భయంగా ఉందని పలువురు వాపోతున్నారు. నరసన్నపేటలో ఈ నెలలో సుమారు 78 మంది కుక్క కాటుకు గురైనట్లు తెలిపారు.

## కేజీబీవీలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



**జలుమూరు, జులై23 (వార్త):** జలుమూరు కేజీబీవీలో ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా మారిందని స్థానికులు తెలిపారు. ఈ విద్యాలయంలో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్లాంటు మరమ్మతులకు గురవడంతో వారంతా బోరు బావి నీటినే తాగుతున్నారు. అధికారులు స్పందించి రూ.లక్షల విలువైన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని తల్లి దండ్రులు కోరారు. సమస్యను మరో రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ప్రత్యేక అధికారిణి అరుగుల యశోద తెలిపారు.

## భోజన నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు: ఎంఈవో

**నరసన్నపేట, జులై 23 (వార్త):** పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహించవద్దని ఎంఈవో ఉప్పాడ శాంతారావు హెచ్చరించారు. మంగళవారం ఆయన జమ్ములోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు గుడ్లు, భోజనం కూడా వేడిగా అందించాలని సూచించారు. రోగాల బారిన పడకుండా చూడాలన్నారు.

## మంత్రి లోకేష్‌ని కలిసిన ఎమ్మెల్యే బగ్గు



**జలుమూరు, జులై23 (వార్త):** వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలను వివరించి, సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413